ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
07-08-2024
బుధవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 338 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి


2 లో

# తెలంగాణలో 2జీ బయో ఇథనాల్ ప్లాంట్

## రూ.1000 కోట్ల పెట్టుబడి. 500 మందికి ఉద్యోగాలు

అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావాలంటే కష్టం కదా.. అందువల్ల ప్రైవేట్ ఉద్యోగాలు చాలా అవసరం. తెలంగాణ నుంచి అమెరికాకి వెళ్లి.. పెట్టుబడుల వేట సాగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. గ్రాండ్ సక్సెస్ అవుతున్నాయి. వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. తాజాగా.. తెలంగాణలో 2జీ బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు కోసం స్వచ్ఛ్ బయో కంపెనీ.. రూ.1000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధపడింది. దీని వల్ల 500 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఈ స్వచ్ఛ బయో కంపెనీ.. బయో ఫ్యూయల్స్ తయారుచేస్తుంది. ఈ కంపెనీ త్వరలోనే తెలంగాణలో సెకండ్ జనరేషన్ సెల్యులోసిక్ బయో ఫ్యూయల్ ప్లాంట్ నెలకొల్పనుంది.

# రూ. 42 కోట్లు పెట్టుబడులు

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 6

గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో చిన్నచిన్న మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమేగాక...వారికి శిక్షణ చేయూతనిస్తున్న వీ హబ్‌కు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి.తెలంగాణకు పెట్టుబడుల సాధించడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిబృందం సమక్షంలో వీ హబ్‌లో పెట్టుబడులకు ఓ భారీ ఒప్పందం జరిగింది.తెలంగాణ ఆర్థిక అభివృద్ధి కోసం పెట్టుబడుల సాధనే లక్ష్యంగా అమెరికా పర్యటన చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (..భారీ పెట్టుబడులే లక్ష్యంగా పలువురితో భేటీ అవుతున్నారు.వివిధ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ పెద్దలతో ఆయన సమావేశమైన తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరుతున్నారు. అలాగే ప్రవాసీయులతోనూ ఆయన సమావేశమయ్యారు. అమెరికా (సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించి మాతృభూమి రుణం తీర్చుకోవాల్సిందిగా కోరారు. ఆయన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.మహిళా సాధికారతే లక్ష్యంగా, అతివలను ఆర్థికంగా తీర్చిదిద్దడమే గమ్యంగా సాగుతున్న తెలంగాణ వీహబ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు అమెరికాకు చెందిన సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి.రూ. 42 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు వాల్స్ కర్రా హోల్డింగ్స్ గ్రూప్ ఒప్పందం చేసుకుంది. రాబోయే ఐదేళ్లలో స్టార్టప్‌లలో మొత్తం రూ. 839 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందు కుదిరింది. ఇందులో భాగంగా వీహబ్‌లో ఈ సంస్థ రూ.42 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టనుంది. వాల్ష్ కర్రా హోల్డింగ్స్ కంపెనీని గ్రెగ్‌వాల్ష్, ఫణికర్రా నిర్వహిస్తున్నారు. తెలంగాణకు చెందిన ఫణికర్రా..ఉస్మానియా వర్సిటీ పూర్వ విద్యార్థి. తెలంగాణలో చదివి అంతర్జాతీయస్థాయికి ఎదిగిన తనకు మళ్లీ మాతృభూమి రుణం తీర్చుకునే అవకాశం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని ఫణి అన్నారు. తెలంగాణ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతోపాటు వారికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న వీహబ్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతోందన్నారు. తమ పెట్టుబడులు వీహబ్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వాల్స్ కర్రా హోల్డింగ్స్ సంస్థ అమెరికా, సింగపూర్‌లో విస్తరించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహకారంతో గ్రెస్‌వాల్ష్, ఫణి ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. కొత్త ఆవిష్కరణలు చేసే స్టార్టప్‌లు, స్థిర లాభదాయకమైన సంస్థలకు ఈ కంపెనీ మద్దతిచ్చి పెట్టుబడులు పెడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ కంపెనీ ప్రతినిధులు, వీహబ్ సీఈవో సీతా పల్లచోళ్ల ఒప్పందం చేసుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధితో సమాజంలో అసమానతలు తొలగిపోతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వీహబ్‌లో పెట్టుబడులు పెట్టినందుకు సంస్థ ప్రతినిధులను అభినందించారు.

# ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీని ఎత్తివేయండి

## పార్లమెంట్ మకర ద్వారం వద్ద 'ఇండియా' పక్షాల నిరసన




జయభేరి, న్యూఢిల్లీ:

ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీ రద్దు డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి నేతలు మంగళవారం పార్లమెంట్ మకర ద్వారం నిరసన చేపట్టారు. 'పన్ను ఉగ్రవాదం' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఎన్సీపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన (ఉద్ధవ్), తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, జేఎంఎం ఎంపీలు పాల్గొన్నారు. ఆరోగ్య రంగంపై జీఎస్టీ ప్రజలపై పెనుభారమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు నష్టపోతున్నారన్నారు. జీఎస్టీతో బాధితుల కష్టాలు రెట్టింపవుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ చెప్పారు. ఇండియా కూటమి ఎంపీల నిరసనపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్ హౌస్ ప్రవేశ ద్వారం వద్ద నిరసనలు, నినాదాలు నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ప్రవేశ ద్వారం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదన్న నిర్ణయానికి కట్టుబడతామని సభ్యులంతా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, 202324 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ కింద రూ.8,263 కోట్లు వసూలు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో వెల్లడించింది.

# పవన్ స్వరంలో మార్పు



జయభేరి, విజయవాడ, ఆగస్టు 6:

నాయకుడు.. పాలకుడుగా మారితే స్వరంలో మార్పు వస్తుంది. వ్యవహార శైలిలో మార్పు వస్తుంది.ఈ విషయంలో పవన్ కళ్యాణ్ ఒక ఉదాహరణ.జనసేన అధినేతగా పవర్ ఫుల్ వాయిస్ వినిపించారు పవన్. అదే పవన్ డిప్యూటీ సీఎం గా మారారు. 50 రోజుల కిందట బాధ్యతలు చేపట్టారు. కానీ మునుపటిలా ఆ స్వరం వినిపించడం లేదు. మాటల వేడి కూడా తగ్గింది. సినీ రంగంలో అనతి కాలంలోనే ఎదిగారు పవన్. తనకంటూ ఒక మేనరిజం ఏర్పాటు చేసుకున్నారు. అందుకే సక్సెస్ అయ్యారు. సినిమాల సక్సెస్ తో పని లేకుండా.. తెలుగు పరిశ్రమలో అగ్రనటుడుగా వెలుగొందారు. పవర్ స్టార్ అన్న బిరుదు దక్కించుకున్నారు. జనసేన పార్టీ స్థాపించిన

...మిగతాది 2 లో

# ఆసుపత్రిలో చేరిన ఎల్.కె.అద్వానీ



జయభేరి, న్యూఢిల్లీ ఆగస్టు 6:

బిజెపి సీనియర్ నాయకుడు ఎల్.కె.అద్వానీ మళ్లీ ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో మంగళవారం అడ్మిట్ అయ్యారు. అభిజ్ఞ వర్గాల కథనం ప్రకారం ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. ప్రస్తుతం ఆయన న్యూరాలజిస్ట్ డాక్టర్ వినీత్ సూరి వద్ద చికిత్స పొందుతున్నారు.



# షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు నిరాకరించిన బ్రిటన్?

జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 6:

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు బ్రిటన్ నిరాకరించిందని సమాచారం. ప్రస్తుతం ఆమె భారత్ లో ఉన్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం హసీనాకు ఆశ్రయం కల్పించడం కష్టతరమని బ్రిటన్ తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. హసీనా ఇక కొంత కాలం భారత్ లోనే ఉండనున్నారు. బంగ్లాదేశ్ లో రిజర్వేషన్ల కోటా తీవ్ర ఘర్షణలకు దారితీసింది.

# పాదయాత్రకు సిద్ధమౌతున్న షర్మిళ



జయభేరి, విజయవాడ, ఆగస్టు 6:

**వైఎస్ షర్మిల పాదయాత్ర చేస్తారా? రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు సిద్ధపడ్డారా? ఇందుకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నారా? మూడు విడతల్లో చేపట్టనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పిసిసి అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె దూకుడుగా కొనసాగుతున్నారు.**

మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కంటే.. వైసిపి ఓటమికి ఎక్కువగా పని చేశారు. తాను అనుకున్నది సాధించారు. జగన్ ను గద్దె దించాలని లక్ష్యంతో పనిచేసిన ఆమె సక్సెస్ అయ్యారు. వైసీపీ ఓటమితోనే పార్టీ క్యాడర్ తో పాటు నాయకులు కాంగ్రెస్ పార్టీ వైపు వస్తారని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు పాదయాత్ర చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఒక రకమైన చేంజ్ కనిపిస్తుందని అంచనా వేస్తున్నారు. వైసీపీకి ఘోర పరాజయంతో జగన్ రాష్ట్రంలో ఉండేందుకు కూడా ఇష్టపడడం లేదు. వైసీపీ సీనియర్లు సైలెంట్ అయ్యారు. జూనియర్లు సైతం జగన్ కు దూరంగా జరుగుతున్నారు. ఇటువంటి తరుణంలో పాదయాత్ర చేస్తే ప్రజల్లో స్థానాన్ని

...మిగతాది 2 లో

# కవిత డీ ఫాల్ట్ బెయిల్ పిటీషన్ వెనక్కి

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 6:

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ కోర్టులో తాను దాఖలుచ చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ ను ఉపసంహరించుకున్నారు. నిజానికి ఈ పిటిషన్ దాఖలు చేశారు కానీ వాదనలు వినిపించలేదు. పదే పదే వాయిదాలు కోరారు. సోమవారం కూడా ఈ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. అయితే సీనియర్ లాయర్లు రానందున కేసు వాయిదా వేయాలని కవిత తరపు లాయర్లు కోరారు. దీంతో న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఎట్టి పరిస్థితుల్లోనూ వాదనలు వినిపించాలన్నారు. అయితే మంగళవారమే పిటిషన్ ఉపసంహరించుకుంటామని కవిత లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు కూడా అంగీకరించింది. అయితే కవిత హఠాత్తుగా డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకోవడం



...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## 2జీ బయో ఇథనాల్ ప్లాంట్

మొదటి దశలో దాదాపు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ని నిర్మించనుంది. ఈ ప్లాంట్ ఏర్పాటులో 250 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, తెలంగాణ అధికార ప్రతినిధి బృందంతో స్వచ్ఛ్ బయో ఛైర్ పర్సన్ ప్రవీణ్ పరిపాటి చర్చలు జరిపారు. ఈ చర్చలు విజయవంతం అయ్యాయి. స్వచ్ఛ బయోతో అంతర్జాతీయ భాగస్వామిగా ఉన్న సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీ బయోమాస్, సెల్యులోజ్ నుంచి జీవ ఇంధనాలు, జీవ రసాయనాలను ఉత్పత్తి చేసే పేటేంట్ పొందటంతోపాటు అవసరమైన సాంకేతికతను అభివద్ధి చేసింది. ఈ కంపెనీ పెట్టుబడులు రాష్ట్రంలో సుస్థిరమైన, పర్యావరణ అనుకూలమైన వృద్ధికి దోహదపడతాయి. అందుకే పెట్టుబడులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ వికేంద్రీకృత అభివృద్ధి దృక్పథం తమను ఆకట్టుకుందని కంపెనీ ఛైర్మన్ ప్రవీణ్ పరిపాటి అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటం తమకు ఆనందంగా ఉందన్నారు. రాబోయే కాలంలో మరిన్నిప్లాంట్లు ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని బయో ఫ్యూయల్స్ హబ్‌గా మార్చాలనే తమ ఆలోచనలను అధికారులతో పంచుకున్నారు. ఇలాంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టడం వల్ల.. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరిగి, యువత చేతికి మనీ వస్తుంది. అందువల్ల ప్రజల కొనుగోళ్లు పెరుగుతాయి. తద్వారా వస్తూత్పత్తి పెరగగలదు. అది మరిన్ని ఉద్యోగాల కల్పనకు దారితీస్తుంది. ఇదంతా ఓ సైకిల్ లా సాగుతుంది. అందువల్ల నిరంతరం పెట్టుబడులు వస్తూ.. తెలంగాణలో అన్ని ప్రాంతాలకూ అవి వ్యాపించాలి. తద్వారా బంగారు తెలంగాణ సాధ్యమవుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెట్టుబడుల ఆకర్షణలో దూసుకెళ్తోంది.

## పవన్ స్వరంలో మార్పు

తర్వాత కూడా అదే పవర్ ను కొనసాగించారు.2014 నుంచి 2019 వరకు ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినా..బలమైన రెండు ప్రాంతీయ పార్టీలకు దీటుగా తన రాజకీయాన్ని నడిపించారు.2019లో పోటీ చేశారు. తాను పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లో ఓడిపోయారు. కేవలం ఒకే ఒక స్థానంలో తన పార్టీ గెలిచింది. అయినా సరే 151 స్థానాలు దక్కించుకున్న వైసీపీకి గత ఐదేళ్లుగా చుక్కలు చూపించారు.ఆయన ప్రజల్లోకి వచ్చిన ప్రతిసారి అప్పటి మంత్రులు,వైసీపీ నేతలకు నిత్యం పనే. పవన్ విమర్శలకు ఎలా తిప్పి కొట్టాలో తెలియక సతమతమయ్యేవారు. అంతలా అప్పుడు రాజకీయాలను శాసించారు పవన్. ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాట తూటాలా మారేది. ప్రత్యర్థి గుండెలను చీల్చుకుంటూ పోయేది. అయితే అటువంటి వ్యక్తి చేతికి అధికారం వచ్చేసరికి సమూల మార్పులు ఉంటాయని అంతా భావించారు. కానీ గత 50 రోజుల్లో కేవలం సమీక్షలు,సమావేశాలు కొనసాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రావడం లేదుపవన్ డిప్యూటీ సీఎం తో పాటు నాలుగు మంత్రి పదవులను స్వీకరించి 50 రోజులు దాటుతోంది. కానీ గతం మాదిరిగా చురుకుతనం, పవర్ ఫుల్ నేతృత్వం కనిపించడం లేదు. అయితే అది అధికారంలో ఉన్నప్పుడు చెల్లదు కూడా. ఒక అధినేతగా పవర్ ఫుల్ నేతగా ఎదిగిన పవన్..అధికారం చేపట్టాక ఆ స్థాయిలో ప్రతాపం, ప్రభావం చూపలేకపోతున్నారు.చేతిలో ఆరు మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. ఆపై డిప్యూటీ సీఎం హోదా ఉంది. అయినా సరే అధికార దర్పం చూపేందుకు పవన్ ఇష్టపడడం లేదు.వాస్తవానికి పవన్ కూటమి ప్రభుత్వంలో హోం మంత్రి పదవి నిర్వర్తిస్తారని అంతా భావించారు. సీఎం తరువాత అంతటి పెద్ద పదవి అదే. సహజంగానే జనసైనికులు సైతం హోం మంత్రి పదవిలో పవన్ ను చూడాలనుకున్నారు. కానీ పవన్ మాత్రం దర్పం కంటే..ప్రజలకు మెరుగైన పాలన అందించే శాఖల కే ఇష్టపడ్డారు.ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలను ఎంచుకున్నారు. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి,పర్యాటక, అటవీ శాఖ..ఇలా పల్లెపాలనకు సంబంధించిన అన్ని రకాల శాఖలను తన వద్ద ఉంచుకున్నారు.అయితే మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పవన్ దూకుడు తగ్గింది. సహజంగానే ఇది జనసైనికులకు మింగుడు పడని అంశం.అందుకే పవన్ క్షేత్రస్థాయిలోపర్యటనలు చేయాలని వారు ఆశిస్తున్నారు. గతం మాదిరిగా సమకాలీన రాజకీయ అంశాలపై స్పందించాలని కోరుకుంటున్నారు.అయితే శాఖలపై పట్టు పెంచుకునేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారు.తన చుట్టూ యువ, నిజాయితీ అధికారులను నియమించుకుంటున్నారు. ప్రతిపక్షం మాదిరిగా అధికారంలో ఉన్నవాళ్లు మాట్లాడడం కుదరని పనిగా తేల్చి చెబుతున్నారు. శాసనసభలో సైతం ఇదే విషయాన్ని ప్రకటించారు. తాను తప్పు చేసినా.. కఠిన చర్యలు తీసుకోవాలని నేరుగా స్పీకర్ నే కోరారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించే స్థాయిలో ఉంటారు. అధికారంలోకి వస్తే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ విషయం తెలుసు కనుక పవన్ తనపని తాను చేసుకుంటున్నారు.అవసరమైతేనే మాట్లాడుతున్నారు.

## కవిత.. బెయిల్ పిటీషన్ వెనక్కి

ఆసక్తికరంగా మారింది. సీబీఐ చార్జిషీటులో లోపాలు ఉన్నాయని కవిత ప్రధానగా ఈ డీఫాల్ట్ బెయిల్ పిటి,న్ దాఖలు చేశారు. కానీ ఇటీవల సీబీఐ చార్జిషీటును కోర్టు పరిగణనలోకి తీసుకుంది. కోర్టే పరిగణనలోకి తీసుకున్నప్పుడు లోపాలు ఉంటాయని ఎలా అంటారని న్యాయస్థానం ప్రశ్నించి.. పిటిషన్ ను డిస్మిస్ చేసే అవకాశాలు ఉన్నాయని ఆమె తరపు లాయర్లు అనకోవడం వల్లనే ఈ పిటిషన్ ఉపసంహరించుకున్నట్లుగా తెలుస్తోంది. తర్వాత అసలు బెయిల్ పిటిషన్‌పై వాదనల్లో ప్రభావం చూపకుండా ఉపసంహరించుకోవడమే మంచిదని అనుకున్నారని అంచనా వేస్తున్నారు. మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈడీ అధికారులు కవితను మార్చి 15వ తేదీన హైదరాబాద్‌లోని ఆమె నివాసంలోనే అరెస్ట్ చేశారు. ఆమె ఇంట్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు.. అదే రోజు సాయంత్రం అదుపులోకి తీసుకుని ఢిల్లీ తరలించారు. అప్పటి నుంచి కొన్ని రోజుల పాటు ఆమె ఈడీ కస్టడీలో ఉన్నారు. ఆపై ఆమెను తీహార్ జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉంచారు. అనంతరం తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవితను సీబీఐ అధికారులు ఏప్రిల్ 11న అరెస్టు చేశారు. ఐదు నెలలుగా తీహార్ జైలులో ఉంటున్నారు. మంగళవారం తీహార్ జైల్లో ఉన్న కవితతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావులు ములాఖత్ అయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో దర్యాప్తు పూర్తయిందని ఇటీవలే సీబీఐ కోర్టుకు తెలిపింది. ఇప్పుడు దర్యాప్తు పూర్తయినందున .. ఇక తనకు బెయిల్ ఇవ్వాలని.. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉండదని పూర్తి స్థాయి బెయిల్కోసం ప్రయత్నం చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అయితే కవిత అటు ఈడీ.. ఇటు సీబీఐ కేసుల్లోనూ బెయిల్ తెచ్చుకోవాల్సి ఉంది. అలా అయితేనే ఆమె బయటకు రాగలరు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు ఈడీ కేసులో బెయిల్ వచ్చింది కానీ సీబీఐ కేసులో ఇంకా రాలేదు.

## పాదయాత్రకు సిద్ధమౌతున్న షర్మిళ

సంపాదించుకోవడంతోపాటు వైసిపి క్యాడర్ను కాంగ్రెస్ వైపు మళ్లించవచ్చని భావిస్తున్నారు షర్మిల. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహం పనిచేసింది. వైసిపి ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. కాంగ్రెస్ పార్టీకి కావాల్సింది కూడా ఇదే. అందుకే వైసిపి నేతలను ఆకర్షించే పనిలో పడింది కాంగ్రెస్. అందుకే షర్మిల పాదయాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో.. మూడు విడతల్లో పాదయాత్ర చేసేందుకు షర్మిల సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చి రెండు నెలలు దాటకముందే ఆమె ఇలాంటి నిర్ణయం తీసుకోవడం విశేషం.తెలుగు నాట పాదయాత్ర చేసిన ఏ నేత ఫెయిల్ కాలేదు. 2003లో సుదీర్ఘ పాదయాత్ర చేసి అధికారంలోకి రాగలిగారు వైయస్ రాజశేఖర్ రెడ్డి. తాను సీఎం కావడమే కాదు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన ఎంపీలను గెలిపించి ఇచ్చారు. అటు తరువాత చంద్రబాబు పాదయాత్ర చేశారు అధికారంలోకి వచ్చారు. జగన్ పాదయాత్ర చేసి మంచి విజయాన్ని దక్కించుకున్నారు. అయితే 2013లో షర్మిల పాదయాత్ర చేశారు. అన్న జగన్ జైలులో ఉండడంతో ఆయన తరుపున ఉమ్మడి రాష్ట్రంలో నడిచారు. కానీ వైసీపీని అధికారంలోకి తేలేకపోయారు.వైసీపీ నాయకులు పార్టీ నాయకత్వం పై అసంతృప్తితో ఉన్నారు. జగన్ వైఖరి నచ్చని చాలామంది సీనియర్లు రాజకీయంగా సైలెంట్ అయ్యారు. మరికొందరు కూటమి పార్టీల్లో చేరాలనుకున్నా ఆహ్వానం లేదు. మరోవైపు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుంది. వచ్చే ఎన్నికల నాటికి మంచి స్థితిలోకి వస్తుందని విశ్లేషణలు ఉన్నాయి. అదే సమయంలో ఏపీ పై కాంగ్రెస్ హై కమాండ్ దృష్టి పెట్టింది. వైసీపీలో ఉన్న నాయకులు, క్యాడర్ అంతా కాంగ్రెస్ పార్టీ దే వారు తిరిగి పార్టీలో చేరితే పూర్వ వైభవం ఖాయం. ఇప్పుడు గానీ షర్మిల తో పాదయాత్ర చేస్తే వైసిపి క్యాడర్ చీలి పోతుందని కాంగ్రెస్ పార్టీ అంచనాకు వచ్చింది.

# తెలంగాణ స్కిల్ యూనివర్శిటీ చైర్మన్‌గా బడా పారిశ్రామిక వేత్త

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 6 :

అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ రోజు కీలక ప్రకటన చేశారు. స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్‌ను ప్రకటించారు. బిలియనీర్, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ స్కిల్ యూనివర్సిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. మరో రెండు రోజుల్లోనే ఆయన తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకునే అవకాశం ఉన్నదని వివరించారు. ఇటీవలే దీనిని సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. ఆగస్టు 1న రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణ నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఈ యూనివర్సిటిని ఏర్పాటు చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అసెంబ్లీలో తెలిపారు. యువతకు ఉపాధితో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఇలా నిరుదోగ్య యువత కోసం ఏర్పాటు చేయనున్న ఈ యూనివర్సిటీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. స్కిల్ వర్సిటీకి చైర్మన్‌ను నియమించారు.

ప్రముఖ వ్యాపార వేత్త, మహీంద్ర అండ్ మహీంద్రా చైర్మన్‌ను.. స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి ఈమేరకు ప్రకటన చేశారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు.ఇక స్కిల్ యూనివర్సిటీ కోసం ప్రభుత్వం 57 ఎకరాల స్థలం కేటాయించింది. రూ.100 కోట్ల నిధులు విడుదల చేసింది. పబ్లిక్ ప్రైవేట్ (పీపీ) భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీ నిర్మించనున్నారు. వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నారు.

మొత్తం 17 కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఈ క్రమంలోని ఈ స్కిల్ యూనివర్సిటీకి ఆనంద మహేంద్రాను చైర్మన్‌గా నియమించారు. రెండ రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డితో ఆనంద్ మహీద్రా సమావేశమయ్యారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని దత్తత తీసుకునేందుకు అంగీకరించారు. త్వరలోనే స్కిల్ యూనివర్సిటీని



పరిశీలించేందుకు తన బృందాన్ని పంపుతానని తెలిపారు. ఈ క్రమంలో చైర్మన్‌గా కూడా ఆనంద్ మహీంద్రనే ప్రభుత్వం నియమించింది.

ఇక ఆనంద్ గోపాల్ మహీంద్రా (జననం 1 మే 1955) ఒక భారతీయ బిలియనీర్ వ్యాపారవేత్త. ముంబై ఆధారిత వ్యాపార సమ్మేళనం అయిన మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఏరోస్పేస్, అగ్రిబిజినెస్, అనంతర మార్కెట్, ఆటోమోటివ్, భాగాలు, నిర్మాణ పరికరాలు, రక్షణ, శక్తి, వ్యవసాయ పరికరాలు, ఆర్థిక మరియు భీమా, పారిశ్రామిక పరికరాలు, సమాచార సాంకేతికత, విశ్రాంతి మరియు ఆతిథ్యం, లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్ మరియు రిటైల్. మహీంద్రా మహీంద్రా - మహీంద్రా సహ వ్యవస్థాపకుడు జగదీష్ చంద్ర మహీంద్రా మనవడు . 2023 నాటికి, ఫోర్బ్స్ ప్రకారం అతని నికర విలువ రూ.2.1 బిలియన్లు. ఆనంద్ మహీంద్రా హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో హార్వర్డ్ బిజినెస్ స్కూల్ పూర్వ విద్యార్థి .1996లో ఆనంద్ మహీంద్రా భారతదేశంలో నిరుపేద బాలికల విద్యకు మద్దతు ఇచ్చే నాన్హి కాలీ అనే ప్రభుత్వేతర సంస్థను స్థాపించాడు. 2011 ఆసియాలోని 25 అత్యంత శక్తివంతమైన వ్యాపారవేత్తల జాబితాలో ఉన్నాడు.తెలంగాణలో యువత ఎక్కువగా ఉన్నా.. వారిలో నైపుణ్యం లేకపోవడంతో చాలా మంది ఉన్నత చదువులు చదివినా ఉపాధి పొందలేకపోతున్నారు. ఇలాంటి వారు డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ప్రభుత్వం భావించింది. వారికి ఉపాధి కల్పిస్తే.. డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయన్న ఆలోచనతోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వచ్చే ఏడాది నుంచి యూనివర్సిటీలో తరగతులు ప్రారంభించనున్నారు.ఇక తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పది రోజుల పర్యటన కోసం అమెరికా వెళ్లారు. అక్కడి ఎన్నారైలతో ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఎన్నారైలను ఆహ్వానించారు. అమెరికా పర్యటన తర్వాత ఈనెల 13న ఆయన తిరిగి రాష్ట్రానికి రానున్నారు. ఆయన వెంట అధికారులతోపాటు మంత్రులు కూడా ఉన్నారు.

# ఏపీ టెట్ కు దరఖాస్తుల వెల్లువ



జయభేరి, విజయవాడ, ఆగస్టు 6

ఏపీలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు గడువు ఆగస్టు 3తో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా టెట్ పరీక్ష కోసం మొత్తం 4,27,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ వివరాలు వెల్లడించింది. గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో ప్రతిరోజూ రెండు సెషన్లలో టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష హాల్‌టికెట్లను సెప్టెంబరు 22 నుంచి అందుబాటులో ఉంచనున్నారు.

**అందిన దరఖాస్తులు ఇలా..**

- ఎస్జీటీ విభాగంలో పేపర్ 1ఎకు 1,82,609 మంది; ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) పేపర్ 1 బికు 2,662 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.
- స్కూల్ అసిస్టెంట్ టీచర్ విభాగంలో పేపర్ 2ఎ లాంగ్వేజెస్‌కు 64,036 మంది; మ్యాథ్స్, సైన్స్‌కు కలిపి మొత్తం 1,04,788 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.
- సోషల్ స్టడీస్‌కు సంబంధించి 70,767 మంది, స్కూల్ అసిస్టెంట్ టీచర్(స్పెషల్ ఎడ్యుకేషన్) పేపర్ 2 బి విభాగంలో 2,438 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

**పరీక్ష విధానం..**

- ఒక్కో పేపరుకు 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒకమార్కు కేటాయించారు. పరీక్షలో నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం 2.30 గంటలు.
- పేపర్1 ఎలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 1 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు 30 మార్కులు, మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు 30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 30 ప్రశ్నలు 30 మార్కులు ఉంటాయి.
- పేపర్1 బిలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 1 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు 30 మార్కులు, మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు 30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 30 ప్రశ్నలు 30 మార్కులు ఉంటాయి.
- పేపర్2 ఎలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 1 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు 30 మార్కులు, మ్యాథమెటిక్స్/ బయాలజీ/ఫిజిక్స్/సోషల్ స్టడీస్/లాంగ్వేజ్ 60 ప్రశ్నలు 60 మార్కులు ఉంటాయి.
- పేపర్2 బిలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 1 30 ప్రశ్నలు 30 మార్కులు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు 30 మార్కులు, కేటగిరీ ఆఫ్ డిజెబిలిటీ స్పెషలైజేషన్ అండ్ పెడగోగి 60 ప్రశ్నలు 60 మార్కులు ఉంటాయి.
- పరీక్షలో అర్హత మార్కులను ఓసీలకు 60 మార్కులు, బీసీలకు 50 మార్కులు, ఎస్సీఎస్టీదివ్యాంగులుఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 40 శాతం ఉంటే సరిపోతుంది.

**ముఖ్యమైన తేదీలు...**

- ఏపీటెట్ జులై 2024 నోటిఫికేషన్ వెల్లడి: 02.07.2024.
- దరఖాస్తు ఫీజు చెల్లింపు తేదీలు: 03.07.2024 03.08.2024.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 03.07.2024 03.08.2024.
- ఆన్‌లైన్ మాక్ టెస్టులు అందుబాటులో: 19.09.2024 నుంచి.
- టెట్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్: 22.09.2024 నుంచి
- టెట్ పరీక్ష షెడ్యూలు: 03.10.2024 20.10.2024. {పేపర్1(ఎ) & పేపర్1(బి), పేపర్2(ఎ) & పేపర్2(బి)}

**పరీక్ష సమయం..**

- సెషన్1: ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.
- సెషన్2: మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు
- టెట్ ప్రాథమిక 'కీ' విడుదల: 04.10.2024.
- ఆన్సర్ కీపై అభ్యంతరాల స్వీకరణ: 05.10.2024 నుంచి.
- టెట్ ఫైనల్ కీ: 27.10.2024.
- టెట్ ఫలితాల వెల్లడి: 02.11.2024.

# డ్రమ్ములో శవం స్టోరీ

## కథ చాలా ఉంది

జయభేరి, కర్నూలు, ఆగస్టు 6:

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్న హోతూరు గ్రామంలో గత నెల 28న డ్రమ్ములో శవం లభ్యమైంది. ఈ హత్యఆస్పరి పోలీసులకు సవాల్‌గా మారింది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి డ్రమ్ము పడేసి పోయారన్న సమాచారంతో తీగలాగినన పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవి పోలీసులకే షాక్ ఇచ్చాయి. ఎమ్మిగనూరు మండలం మసీదు పురం గ్రామానికి చెందిన పేటయ్య, నరసింహుడు ఇద్దరు స్నేహితులు. పేటయ్య తనకున్న స్థలం అమ్మి 7,50,000 రూపాయలు తన దగ్గర ఉంచుకున్నాడు. ఎలాగైనా ఆ సొమ్మును కొట్టేయాలని నరసింహుడు ఆలోచించాడు. పేటయ్యకు మాయ మాటలు చెప్పి దొంగ నోట్లు ఇప్పిస్తానని హోలెబీడు గ్రామానికి చెందిన హనుమంతు, పంపన్న దగ్గరకు తీసుకెళ్లాడు. అందరూ అప్పటికే భారీ స్కెచ్ వేశారు. అనుకున్నట్టుగానే గత నెల 25న పేటయ్యకు సైనేడ్ కలిపిన మద్యం బలవంతంగా తాగించి హత్య చేశారు.

ఆ తర్వాత ఆ శవాన్ని పంపన్న పొలంలో ఉన్న షెడ్ దగ్గర పూడ్చిపెట్టారు. అక్కడ దుర్వాసన రావడంతో ఆ శవాన్ని బయటకు తీసి ఓ ప్లాస్టిక్ డ్రమ్ములో పెట్టి చిన్న హోతురు గ్రామ సమీపంలో ఉన్న వంకలో పడేసి పోయారు. డ్రమ్ములో నుంచి వాసన వస్తుండడంతో స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రమ్మును ఓపెన్ చేసి చూడగా అందులో శవం కనిపించింది. ఆశ్చర్యపోయిన పోలీసులు అది మర్డర్‌గా అనుమానించి విచారణ చేపట్టారు. విచారణలో తన ప్రాణ స్నేహితుడే పేటయ్యను కిరాతకంగా చంపి ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పేటయ్య హత్యకు పాల్పడిన నరసింహుడు, హనుమంతు, పంపన్నను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా గతంలో నరసింహుడు తండ్రినే చంపిన కేసులో నిందితుడు. తండ్రి ఉద్యోగం కోసం ఈ పని చేశాడని తేలింది. మాజీ నక్సలైట్ అని జనాన్ని హనుమంతు బెదిరించిన డబ్బులు దండుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. వారి నుంచి 7 లక్షల 50 వేల రూపాయలు రికవరీ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

# స్వచ్ఛందనం - పచ్చదనం అందరి బాధ్యత

- గుండ్లపోచంపల్లి పల్లెప్రకృతి వనంలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్

**జయభేరి, మేడ్చల్ :**



ప్రతిఒక్కరూ తమ జీవితంలో స్వచ్ఛదనం పచ్చదనం ఒక భాగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గుండ్ల పోచంపల్లి పురపాలక సంఘం, కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ గౌతమ్ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమములో భాగముగా నీటి సరఫరా ట్యాంక్ లను శుభ్రపర్చి క్లోరినేషన్ చేసి, క్లోరినేషన్ లెవెల్ పరీక్షలు పరీక్షలు జరిపించాలని మరియు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు, ఇంకుడు గుంతలు లేని భవనాలను గుర్తించి వారికి ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. "స్వచ్ఛదనం - పచ్చదనం" కార్యక్రమము లో భాగంగా గుండ్ల పోచంపల్లి ఎస్సీ కార్పొరేషన్ డెవలప్మెంట్ సొసైటీ లో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం మొక్కలు నాటడం జరిగింది అలాగే ప్రస్తుత మున్సిపల్ పన్ను విధానం ప్రకారం కొత్తగా నిర్మించే భవనాలకు, అదనపు అంతస్తులు నిర్మించే భవనాలు, కాంప్లెక్స్, కర్మాగారాలు, వ్యాపార సంస్థలు మొదలైన వాటికి పన్ను విధించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో ఉన్న చెరువులను పరిశీలించి వాటి ఎఫ్ టి ఎల్ పరిధి నిర్ణయించడంలో సత్వర చర్యలు చేపట్టాలన్నారు అదేవిదంగా చెరువులను సంరక్షిస్తూ కబ్జా కి గురి కాకుండా నిరంతర పర్యవేక్షణకు గాను సీసీ కెమెరాలను ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ఏదైనా అవకతవకలు జరిగితే క్రిమినల్ కేసులు పెట్టి ఐన వినకపోతే పీడీ ఆక్ట్ కింద కేసులు బుక్ చెయ్యమన్నారు.

అనంతరం కొంపల్లి మున్సిపాలిటీలోని మున్సిపల్ పార్కులను సందర్శించారు. అదేవిధంగా మొక్కలు నాటడానికి ఆయా మున్సిపల్ పరిధిలో నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గౌరవ కలెక్టర్ గారు మాట్లాడుతూ పార్క్ లు మరియు పిల్లల కోసం ఆట స్థలాలు అభివృద్ధి చేయాలని ఆదేశించారు . ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ ఏ స్వామి, స్పెషల్ ఆఫీసర్ వినోద్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, కొంపల్లి మునిసిపల్ కమీషనర్ శ్రీహరి , స్పెషల్ ఆఫీసర్ శ్రీ ఎస్ వెంకటేశం డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్, వైస్ చైర్‌పర్సన్ రాత్లవాత్ గంగయ్య నాయక్, గౌరవ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది మరియు సంబందించిన అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

**జయభేరి, ఆగస్టు 6:**

జలజీవన్ మిషన్ తో చటాకాయి గ్రామంలో మైక్రో వాటర్ ఫిల్టర్ ప్రారంభోత్సవం కామినేని శ్రీనివాస్ 05/08/2024 ఏలూరుజిల్లా కైకలూరు మండలం చటకాయి గ్రామములో జలజీవన్ మిషన్ పథకం ద్వారా 36 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్స్ ని ప్రారంభించిన శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు.. గ్రామ ప్రజలు ఫిల్టర్ వాటర్ ని సద్వినియోగం చేసుకోవాలి ఆరోగ్యంతో ఉండాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి చెయ్యటంలో NDA ప్రభుత్వం ముందు ఉంటుందని. ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు సాధ్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి పేద వాడు సంపన్నులు కావాలని సంక్షేమ పథకాలు అందేలా చెయ్యాలని ఆరోగ్యం తో ఉండే విధం గా NDA ప్రభుత్వం అడుగులు వేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు మరియు NDA నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముందు నుయ్యి వెనక గొయ్యి చోద్యం చూస్తున్న అధికారులు



**జయభేరి, ఆగస్టు 6:**

ముందు నువ్వు వెనక గొయ్యి లాగా బొమ్మనంపాడు సెంటర్లో గొయ్య రోడ్డు కృంగి ఎంత లోతు దిగుతుందా అని ఆర్ అండ్ బి అధికారులు ఎదురుచూస్తున్నారు ఏమో గాని వాహనాలు నడిపే వారు మాత్రం ఆ గొయ్యిలో పడిపోయి క్షతగాత్రులు అవుతున్నారు అది ఎక్కడో కాదు నిరంతరం వాహనాలు వెళ్లే రాష్ట్ర రహదారి లో సింగరాయపాలెం భీమవరం వెళ్లే ప్రధాన రహదారిలో ముదినేపల్లి మండలంబొమ్మనంపాడు గ్రామ సెంటర్లో ఏడాది క్రితం ఏర్పడిన చిన్న గొయ్యి ఇప్పుడు ప్రమాదకరమైన పెద్ద గొయ్యిగా రూపు దాల్చింది చిన్నపాటి వర్షానికి పెద్ద చెరువుల మారుతుంది వర్షాలు ఆగిపోయిన ఆ గొయ్యిలో నీరు మాత్రం తగ్గదు దానంతట అది ఆరాల్సిందే హైస్కూల్ ప్రక్కనే ఉన్న ఈ గొయ్యిలు ముందు నుయ్య వెనక గొయ్య లాగా మారాయి ఈ గొయ్యి పక్కన ఉండి విద్యార్థులు వెళ్లడానికి కూడా దారి లేకుండా పోయింది ఆర్ అండ్ బి అధికారులు వెంటనే ఆ ప్రమాదకరమైన గొయ్యలను పూడిడిపించాలని గ్రామ జనసేన నాయకుడు పాసింజర్ కిషోర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు కోరారు.

## మల్లంపేటలో కూల్చివేతలు

**జయభేరి, మేడ్చల్:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి లోని మల్లంపేటలో సర్వేనెంబర్. 170 శ్రీలక్ష్మి శ్రీనివాస నిర్మాణసంస్థ ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు లు మాయంఅయ్యాయి. తరువాత రాత్రికి రాత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సమాచారం అందగానే రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు. పోలీస్ భారీ బందోబస్తుతో కూల్చివేతలు ప్రారంభించారు.

# నిజామాబాద్ ఐడీసీఎంఎస్ చైర్మన్ గా తారాచంద్

- అధికార పార్టీ నుంచి ఇద్దరు నామినేషన్ దాఖలు
- ఒకరి విడ్రాతో.. ఏకగ్రీవమైన తారాచంద్

**జయభేరి, నిజామాబాద్, ఆగస్టు 06:**



ఇందూరు ఉమ్మడి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్ గా తారాచంద్ నాయక్ ఏకగ్రీవ మయ్యాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందూరు ఉమ్మడి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గా ఉన్న సాంబారు మోహన్ తన పదవికి రాజీమానా చేశారు .ఆ తర్వాత ఇన్చార్జి చైర్మన్ గా ఇంద్రసేనారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో చైర్మన్ పదవి కోసం ఎన్నికలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో స్టేట్ కోఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారిగా కామారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పదవికి అధికార పార్టీకి చెందిన గాంధారి సొసైటీ చైర్మన్ సాయన్న, రాంపూర్ సొసైటీ చైర్మన్ తారా చంద్ నాయక్ లు ఇద్దరూ నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ పీఠం కోసం సొసైటీ కార్యాలయం వద్ద ఎన్నిక రసవత్తరంగా మారింది. ఎట్టకేలకు గాంధారి సాయన్న నామినేషన్ విడ్రా చేయడంతో... తారా చంద్ నాయక్ ను సొసైటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి తారాచంద్ నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు. తారాచంద్ అనుచర వర్గం మిఠాయిలు పంచుతూ ఘనంగా సంబురాలు జరిపారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా. తారాచంద్ నాయక్ ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఏకగ్రీవంగా ఎన్నికైన తారాచంద్ నాయక్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పజెప్పిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డిజిపి చేతుల మీదుగా ప్రశంసా పత్రం

- డిజిపి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్న కామారెడ్డి జిల్లా పోలీస్ అధికారులు

**జయభేరి, కామారెడ్డి, ఆగస్టు 06 :**




మెదక్ జిల్లా శంకరంపేట్ (రూరల్) పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్య కేసులో సరియగు పద్ధతిలో పరిశోధన చేసి,సాక్ష్యధారాలను కోర్టు లో ప్రవేశపెట్టి,నేరస్థుడిపై కేసు రుజువు కావడంతో జీవిత ఖైదు శిక్షతోపాటు ,జరిమానా కూడా విధించే విధముగా పరిశోధన చేసిన ప్రస్తుత కామారెడ్డి ఎస్.హెచ్.ఓ గా పనిచేస్తున్న కె.చంద్రశేఖర్ రెడ్డి,ఇన్స్పెక్టర్ తెలంగాణ రాష్ట్ర డిజిపి,మంగళవారం రోజు డీజీపీ కార్యాలయములో అన్ని జిల్లాల ఎస్పీ సమక్షములో,వారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం ను ఇవ్వడం జరిగింది.అదేవిధంగా మన కామారెడ్డి జిల్లాలోని గతంలో బిచ్కుంద సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పని చేసినటువంటి ఆర్.కృష్ణ,బిచ్కుంద పోలీస్ స్టేషన్ హత్య కేసులో కూడా నేరస్థుడికి జీవిత ఖైదు మరియు జరిమానా కూడా విధించే విధంగా పరిశోధన చేసినందుకు డిజిపి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోవడం జరిగింది.ఈ సందర్భముగా కామారెడ్డి జిల్లా ఎస్పీ,కామారెడ్డి ఎస్.హెచ్.ఓ ని,ఆర్ కృష్ణ అభినందించడం జరిగినది.

# పాత విశ్వనాథంతో నాకు ప్రాణ భయం ఉంది

- బిల్డర్ లక్ష్మీబాయి

**జయభేరి, కామారెడ్డి, ఆగస్టు 06 :**



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత విశ్వనాథం వడ్డీ వ్యాపారి కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి గాయత్రి నగర్ కి చెందిన లక్ష్మీబాయి బిల్డర్,పాత విశ్వనాథం,లక్ష్మి బాయి ఇంటి మీదికి దాడికి పాల్పడ్డాడు. పాత విశ్వనాథంపై అలాగే అల్లుడు తేజ పైన చట్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. కామారెడ్డి జిల్లా దేవునిపల్లి గ్రామం లోని 35వ వార్డు కు చెందిన వారు మరి లక్ష్మీ బాయి బిల్డర్ కామారెడ్డి పట్టణనికి చెందిన పాత విశ్వనాథం వడ్డీ వ్యాపారి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకుని, వడ్డీకి ఇస్తాడు.మూడు రూపాయల చొప్పున మిత్తికి ఇస్తాడు. మూడు నెలలకు ఒకసారి రెన్యువల్ చేస్తాడు. బిల్డర్ లక్ష్మీబాయి, పాత విశ్వనాథం సోమవారం రోజు సాయంత్రం బిల్డర్ లక్ష్మీబాయి ఇంటి దగ్గరికి పాత విశ్వనాథం, అల్లుడు కిరణ్, అన్న తేజ, ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు, తీసుకొనివచ్చి నాకు తెలియకుండా తాళం చేయి పలకొట్టడం జరిగింది.

సందర్భంలో లక్ష్మీ బాయి ఇంట్లో లేని సమయంలో, ఇంటిపై దాడి చేశారు. లక్ష్మి భాయి తిరిగి వచ్చి చూసేసరికి, పాత విశ్వనాథం అల్లుడు తేజ,లక్ష్మీ బాయి ఇంటి తాళాన్ని పగలగొట్టడం చూసి 100 డయల్ కు కాల్ చేసింది. పాత విశ్వనాథంతోని నాకు ప్రాణ భయం ఉందని బిల్డర్ లక్ష్మీబాయి తెలిపారు. మీడియా ద్వారా నైనా నాకు న్యాయం చేయగలరని కోరుతున్నాను.



## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

ప్రొఫెసర్ జయశంకర్ ఆ శయాల సాధన కోసం నేటితరం యువత కృషి చేయాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం గుండ్లపోచంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ సేవలు మరువలేనివి

- గుండ్లపోచంపల్లిలో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు



**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ భావ జాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం గుండ్లపోచంపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్వామి, ప్రజాప్రతినిధులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మలి దశ ఉద్యమానికి దిక్సూచిగా తెలంగాణ జన హృదయాల్లో నిలిచిన జయశంకర్ రాష్ట్ర సాధనకు కోసం చేసిన త్యాగం మరువలేనిది. తెలంగాణ సిద్ధాంత కర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన శాశ్వతంగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్, అమరం సరస్వతీ, అమరం జైపాల్ రెడ్డి, దొడ్ల మల్లికార్జున్, భేరి బాలరాజు, అమరం హేమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, బండారి నరేందర్, బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, డిఈ దుర్గాప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, బిల్ కలెక్టర్లు లింగా ప్రసాద్ గౌడ్, శేషిధర్ రెడ్డి, సంతోష్, విజయ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, క్రిష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్ లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి - కంఠం కృష్ణారెడ్డి



**జయభేరి, ఆగస్టు 6:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సైదులు, డిఆర్ డివో సాంబశివరావు, డిపివో వెంకయ్య, స్థానిక నాయకులు కంఠం కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు కంఠం కృష్ణారెడ్డి మట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు. వ్యాధులు ప్రబలకుండా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొదించడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో మమతాబాయి, ఎంపిఓ వినూత్న రెడ్డి , మాజీ వార్డు సభ్యులు కనకాల లింగం, బాలేష్, అంగన్ వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## తుర్కపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

- తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివి - సూపర్ వైజర్ రేణుక




**జయభేరి, ఆగస్టు 6:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం తుర్కపల్లి గ్రామంలో అంగన్ వాడి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సంధర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని ఈ సంధర్భంగా అంగన్ వాడి సిబ్బంది సూచించారు. తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివని అన్నారు. అదేవిదంగా నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే సహజ రోగ నిరోధక శక్తి కలిగేలా చేస్తాయని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ్ కుమార్, సూపర్వైజర్ రేణుక , అంగన్వాడి టీచర్లు ,డాక్టర్లు , తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యాడ్ దగ్గర మొక్కను నాటిన ఎమ్మెల్యే

- తీదేడు గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం, తీదేడు (వెంకటంపేట) గ్రామంలో స్వచ్ఛదనంపచ్ఛదనం కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్ తీదేడు గ్రామంలో డంపింగ్ యాడ్ దగ్గర మొక్కలను నాటి నీళ్లు పోయడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్ మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని కోరారు. మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామ పంచాయితీ అధికారులకు తెలిపారు,గ్రామాలలోని ఉన్న మంచి నీటి ట్యాకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి కోరారు.గ్రామాలలోని వీదులన్నింటిని శుభ్రం చేయాలి అని కోరారు.ప్రతి ఒక్కరూ మొ



క్కలను నాటాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు,చింతపల్లి తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపిడిఓ సుజాత,ఫారెస్ట్ ఆఫీసర్లు, ఆర్ ఐ సునీత, యాదయ్య, ఏపీఓ శౌరి రెడ్డి, తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపిపి కొండూరు భవాని పవన్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవ రెడ్డి, ముచ్చర్ల యాదగిరి, ఎరుకాల వెంకటయ్య గౌడ్, జంగిటి నర్సింహ, అంగిరేకుల గోవర్ధన్, శేఖర్, తీదేడు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శివర్ల శంకర్ యాదవ్, దాసరి మారయ్య, కొరివి యాదగిరి, మర్రు మీనా రావు, షైక్ సిద్ధక్, కొరివి రాధాకృష్ణ, గునమోని శ్రీనివాస్, సందే కిరణ్, ఇడమోని శ్రీను, చింతకుంట్ల రాకేష్, చకిలం శ్రీను, ఐతమోని వెంకటయ్య, అంజయ్య, రసిక శంకర్, తీదేడు గ్రామ ప్రజలు తీదేడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదీర్, సుధాకర్ రెడ్డి, లైన్ మెన్ వడ్లకొండ యాదయ్య, అంగనివాడి సూపర్వేసర్ అంజమ్మ, ఏపీఎం విజయలక్ష్మి, తీదేడు పంచాయతీ కార్యదర్శి అశోక్, ఏఈఓ మౌనిక, టి ఏ పకిరా, ఎఫ్ ఎ చంద్రయ్య, ఏఎన్ఎం రామలక్ష్మి, ఎమ్ ఎల్ హెచ్ ఓ శిరీష్, అంగనివాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు, సంఘబందం అధ్యక్షులు మొరుపోజు రాజేశ్వరి, మహిళ సంఘ సభ్యులు, వివిధగ్రామల టి ఏ లు, ఎఫ్ ఎలు, ఈసీస మీర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ పట్టణంలో ఘనంగా ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతి వేడుకలు



- గద్దర్ లేని లోటు పూడ్చలేనిది - ఎమ్మెల్యే నర్సారెడ్డి

**జయభేరి, ఆగస్టు 6:**

ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, స్థానిక నాయకులు గాడిపల్లి భాస్కర్ లు హాజరై గద్దర్ కు ఘన నివాళి అర్పించారు. తన మాటలు, పాటల ద్వారా యావత్ తెలంగాణ ప్రజల గుండెల్లో గద్దర్ చిరస్థాయిగా నిలిచారని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. గద్దర్ లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, నక్క రాములు, సుభాష్ చంద్రబోస్, సర్దార్ ఖాన్, నంగునూర్ సత్యనారాయణ, వర్గల్ మాజి ఎంపిపి మోహన్ గంగిషెట్టి రాజు, టిల్లు, కప్ప భాస్కర్, వెంకటేశ్వర్ రావు, గాడిపల్లి శ్రీనివాస్, ప్రవీణ్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

## డయబేటిక్, రక్తపోటు నిర్ధారణ పరీక్షలు



**జయభేరి, దేవరకొండ :**

లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర దేవరకొండ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ముత్యాలమ్మ బజార్లో బీపీ షుగర్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆప్ సహస్ర దేవరకొండ అధ్యక్షురాలు శివ పార్వతి మాట్లాడుతూ.. రక్తహీనతను అధిగమించి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రెసిడెంట్ శివ పార్వతి, సెక్రటరీ అలివేలు మంగ, చార్టెడ్ ప్రెసిడెంట్ పున్న శైలజ, పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల ఉషారాణి, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ వనం యాదమ్మ,జెర్సీ వనం బిక్షమయ్య,నేతాల వెంకటేశ్వర్లు, ఎం జె ఎఫ్ గాజుల రాజేష్, సిరందాసు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ సారు 90వ జయంతి




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నందు తెలంగాణ సాధన ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన జయశంకర్ సారు 90వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి అధ్యక్ష, సహా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి తాటిశెట్టి నరసింహ, గంగిడి దామోదర్ రెడ్డి, అంకం చంద్రమౌళి, పంగునూరు లింగయ్య పూలమాల అలంకరించి, జ్యోతి ప్రజ్వాలనచేసి నివాళులు అర్పించారు, వారు మాట్లాడుతు జయశంకర్ సారు తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకు అంకితం చేసినారు. వారు కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పనిచేసినారు,1969 నాన్ ముల్కి, సాంబార్ ఇడ్లిగొబ్యాక్ ఉద్యమములో పాలుగోన్నారు. తరువాత 2001నుండి తెలంగాణ రాష్ట్ర సాధన సమితిలో చేరి మాలిదశ తెలంగాణ ఉద్యమ నేత కల్వకుంట్ల చెంద్రశేఖర్ రావు సారథ్యంలో వారి సలహాదారుడుగా ఉన్నారు తన చిరకాల కోరిక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చూడకుండానే కనుముశారు అనంతరం వారి గుర్తుగా వారి పేరున జయశంకర్ జిల్లా ఏర్పాటు చేసినారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, కార్యనిర్వాహాక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, కార్యవర్గం సభ్యులు జంపాల యాదగిరి, ముసిని వీరయ్య, గుమ్మడవల్లి కోటయ్య,ఆడిటర్ వనం బుచ్చయ్య, చెన్నయ్య, సభ్యులు జంపాల దయానందం, అప్పం వీరయ్య, అలంపల్లి శ్రీనివాసులు, మౌలానా, సల్వాది పెద్దులు, వడ్డే గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో 15 సీట్లు ఖాళీలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని మహాలక్ష్మి మహిళా వయోవృద్ధ స్త్రీల వసతి గృహము నందు 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని అధ్యక్షులు మాదిరెడ్డి సంధ్యారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు వృద్ధాశ్రమంలో ఉండాలనుకునే వృద్ధులు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురాగలరని తెలిపారు. మరింత సమాచారం కొరకు 85200 84123 నెంబర్ను సంప్రదించగలరని తెలియజేసినారు.

## విచ్చలవిడిగా ఇసుకను తవ్వేస్తే వినాశనమే

- ముదిగొండ వాగును రక్షించాలని గ్రామానికి చెందిన రైతులు ప్రజలు ఆర్డీఓ, తాసిల్దార్ కు వినతి పత్రం అందజేత



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం ముదిగొండ వాగును రక్షించాలని గ్రామానికి చెందిన రైతులు ప్రజలు మంగళవారం ఆర్డీఓ, తాసిల్దార్ కార్యాలయంలో వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. మేమంతా వాగు నీటి మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నామని, కొందరు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ఇష్టానుసారంగా ఇసుక రవాణాతో భూగర్భ జలాలు పడిపోతున్నాయని, ఇసుక తరలింపుకు అనుమతులు ఇవ్వవద్దని అధికారులను వేడుకున్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఘనంగా సత్కారం

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఘనంగా సత్కారం అభినందనలు. 38th షోటోకన్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2024 నకరేకల్లు లో నిర్వహించిన ఈ కరాటే పోటీలకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున 62 మంది పాల్గొనగా 20 మంది విన్నర్స్ గా గెలవగా, ద్వితీయ తృతీయ స్థానంలో 7 గురు గెలుపొందినారు. ఈరోజు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు విజయోత్సవ కేకు ని మున్సిపల్ చైర్మన్ అల్లంపల్లి నరసింహ, మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వి టి సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులకు కళాకారులకు సమాజ సేవలో ముందుంటూ ఎంతో మందికి చేదోడు వాదోడుగా ఉంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ని సభ్యులని అభినందించారు. అలాగే ఈ యొక్క పిల్లల విజయానికి కారకులైన కరాటే మాస్టర్ నల్గొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్, డీఎస్ ఏ మాస్టర్ చిత్తనూరి శ్రీను మాస్టర్ ను ప్రత్యేకంగా అభినందించినారు. జాతీయస్థాయిలో పాల్గొని 20 మంది ప్రథమ స్థానంగా గెలవడం గర్వించదగ్గ విషయమని అన్నారు .దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ కి మేము ఎప్పుడు అండగా ఉంటామని, క్రీడాకారుల కోసం క్రీడా స్థలాల కోసం మేము తప్పకుండా సహకరిస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, భాస్కర్ రెడ్డి,డాక్టర్ రవి ప్రకాష్, పీ జే శాంసన్, మాకం మహేష్, పోలీస్ నాగరాజు, మురళి, మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పులకంటి భాస్కర్, డాన్స్ మాస్టర్ జగన్, దినేష్ ,అభిష్, రాజు ,రామ్, చరణ్, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

**గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు**

సమన్వి, సాయి వర్ధనా చారి, అనంత భవిష్, జనిష్ ,అభిష్, సాయి ప్రశాంత్, పి వినీల్ కుమార్, దినేష్ ,శ్రేష్టి, నైనిక్ ,యశస్వి, అనంత లక్ష్మి, అరణ్య ,వెన్నెల, ధనుష్, దీక్షిత, అనురాధ, మేఘన, రజిత, నాగేశ్వరి.

**ద్వితీయ తృతీయ సాధించిన విద్యార్థులు**

చరణ్, విక్షిత, గౌతమి, శివరామరాజు, సుకుమార్, అంజి, ఎం శ్రీలత.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**జయభేరి, కామారెడ్డి, ఆగస్టు 06 :**

కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకొని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకూ పోరాడిన వ్యక్తి ప్రొ.జయశంకర్.1934లో వరంగల్ (డి) అక్కంపేటలో జన్మించిన ఆయన విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ సాధన కోసం ఎనలేని కృషి చేశాడు అని ఆయన సేవలను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తన జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పరితపించిన పూజ్యులు,నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన నిరంతర పోరాట యోధులు, తెలంగాణ ముద్దుబిడ్డ అని గుర్తు చేశారు.అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారంటే కేవలం జయశంకర్ సార్ పుణ్యమే కానీ తెలంగాణ రాష్ట్రము ఏర్పడక ముందే 2012 మరణించారన్నారు, సిద్ధాంతం, ప్రచారం, ఉద్యమం అనే ముడు అంశాల ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్య పరిచి ఉద్యమం ను ఉద్రిక్తం చేశారన్నారు, అలాగే 16 ఏట లోనే తెలంగాణ మాలి ఉద్యమంలో పాల్గొన వ్యక్తులలో ఏకైక వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మసూద్ హైమద్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ బద్రత కల్పించాలి

- వంగపల్లి శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్

**జయభేరి, దేవరకొండ :**



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ బద్రత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. దేవరకొండలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశాన్ని ఆరోగ్య వంతమైనదిగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికులది కీలకపాత్ర. కరోనాలాంటి బయానక పరిస్థితులలో కూడా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవ చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలలో మాత్రం పారిశుధ్య కార్మికులను పొగుడుతూ.. వారిని ఆదుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు గతంలో పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగాడు కానీ వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి చర్యలు తీసుకోలేదు అరకొర జీతాలతో కార్మికుల బతుకులు దుర్భరం అవుతున్నాయి. వారికి మిగతా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వెతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువసేన అధ్యక్షులు పొట్ట పెంజర రమేష్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ మాదిగ, దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ పొట్ట మురళి, చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు, మల్లెపల్లి మండల అధ్యక్షులు అందుగుల కేశవులు, పడమటపల్లి మాజీ ఎంపిటిసి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్ము నరసింహ, పేర్వాల ఎంపిటిసిపి సీనియర్ నాయకులు పేరు వాళ్ళ వెంకటయ్య, సుంకి శాల మాదే సర్పంచ్ ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు, బాష్పాక రాములు, దేవరకొండ మండల అధ్యక్షులు కొమ్ము ఉదయ్ , జిల్లా కార్యదర్శి ఆలేటి నరసింహ, మద్దిమడుగు అచ్చిత్, హరి గోవర్ధన్, మద్దిమడుగు అంజనేయులు, ఎర్ర సైదులు, ముడి శ్రీను, జుట్టు మహేందర్, ఎలిమినేటి ఈశ్వర్, తరి అంజి, పొట్ట అంజి, తదితరులు పాల్గొన్నారు

## శ్రీ పరంజ్యోతి భగవతి భగవాన్ ఆలయంలో అన్నదానం

- నేటి అన్నదాతలుగా బాబురావు కీర్తిశేషురాలు శాంతాబాయి

**జయభేరి, కామారెడ్డి, ఆగస్టు 06 :**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కల్కి నగర్ లో గల శ్రీ పరంజ్యోతి భగవతి భగవానుల ఆలయంలో మంగళవారం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.నేటి కార్యక్రమానికి అన్నదాతలుగా గాంధారి మండలం బొప్పాజివాడి గ్రామానికి చెందిన బాబురావు కీర్తిశేషురాలు శాంతాబాయి,వారి కూతురు మధుశ్రీ గోపాల్ రావు దంపతులు ముందుకు రావడం జరిగిందని వారికి కలికి మానవ సేవా సమితి తరపున అభినందనలు నిర్వహించడం జరిగిందన్నారు.అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని.ఈ అన్నదాన కార్యక్రమానికి 350 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించడం జరిగిందన్నారు. అన్నదానం చేయాలనుకున్న వారు వారి యొక్క వివరాలను ఎర్రం చంద్రశేఖర్ ను 98496 01438 ను సంప్రదించాలని అన్నారు.

# మూవీభేరి

## డబుల్ బ్లాక్‌బస్టర్ పక్కా

'పూరీ జగన్నాథ్ హీరోయిన్ అనిపించుకోవాలని ఎప్పట్నుంచో కోరిక. 'ఇస్మార్ట్ శంకర్'కి ఆడిషన్ కూడా ఇచ్చా.. కుదర్లేదు. డబుల్ ఫన్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ వుండే ఈ 'డబుల్ ఇస్మార్ట్'లో అవకాశం దొరికింది. చెప్పలేనంత ఆనందంగా ఉంది. పూరీ అద్భుతమైన విజన్ ఉన్న గ్రేట్ డైరెక్టర్. ఆయన సినిమాలో చేయడమే ఓ గొప్ప విషయం అయితే.. రామ్, సంజయ్‌దత్ లాంటి బిగ్‌స్టార్స్ ఉన్న సినిమాలో భాగం కావడం నిజంగా జాక్‌పాటే' అని కథానాయిక కావ్యథాపర్ అన్నారు. రామ్ కథానాయకుడిగా పూరీ జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో ఛార్మీతో కలిసి నిర్మించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. బ్లాక్‌బాస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి స్వీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో ఓ కథానాయికగా నటించిన కావ్యథాపర్ మంగళవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఇందులో నాది బోల్డ్ అండ్ స్ట్రాంగ్ కేరక్టర్. అలాగే స్మార్ట్‌నెస్, ఇన్నోసెన్స్ కూడా ఉంటుంది. ఇందులో ఫైట్స్ కూడా చేశా. రామ్ హైలీ ఎనర్జిటిక్. మా కెమిస్ట్రీ యూత్‌ని బాగా ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌లో బెస్ట్ డ్యాన్స్ ఇందులోనే ఇచ్చాను. అలాగే సంజయ్‌దత్‌సార్‌తో నటించడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్. పేరుకు తగ్గట్టే 'డబుల్ ఇస్మార్ట్' డబుల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది' అని నమ్మకం వ్యక్తం చేసింది కావ్య థాపర్.







## నేను ఆయన సిద్ధు బ్యాక్ టు షూట్..

టాలీవుడ్ యువ హీరో సిద్ధు జొన్నల గడ్డ ఈ ఏడాది టిల్లు 2 సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నాడని తెలిసిందే. ప్రస్తుతం పాపులర్ స్క్రీన్ రైటర్ కోన వెంకట్ సోదరి నీరజ కోన డైరెక్షన్‌లో తెలుసు కదా సినిమాలో నటిస్తున్నాడు.. ఈ మూవీలో రాశీఖన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా డీజే టిల్లు యాక్టర్ కొత్త సినిమా షూట్‌లో జాయిన్ అయ్యేదెప్పుడో ఎదురుచూస్తున్న సినీ జనాల కోసం ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. తెలుసు కదా చిత్రీకరణ మొదలైంది. మొదటి రోజు షూట్‌లో సిద్ధు, రాశీఖన్నా జాయిన్ అయ్యారు. 30 రోజులపాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో టాకీ సీక్వెన్స్‌తోపాటు సాంగ్స్‌ను షూట్ చేయబోతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రాన్ని టాలీవుడ్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్నాడు.నేషనల్ అవార్డు విన్నింగ్ ఎడిటర్ నవీన్ నూలి ఈ చిత్రానికి వర్క్ చేస్తున్నాడు. ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాశ్ కొల్లా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా శీతల్ శర్మ పనిచేస్తున్నారు. PMF30గా వస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. స్టైలిష్‌ట్‌గా పాపులర్ అయిన నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా అదృష్టాన్ని పరీక్షించుకోనుండటంతో సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సిద్ధు జొన్నల గడ్డ మరోవైపు టిల్లు ఫ్రాంచైజీలో టిల్లు 3 కూడా చేయబోతున్నాడని తెలిసిందే. దీనికి సంబంధించిన కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది.

## ఫ్యాన్స్ ఫిక్సయిపోయారు

బాలకృష్ణకు సంబంధించిన ఏ తాజా వార్త వెలుగు చూసినా.. అది సోషల్‌మీడియాలో క్షణాల్లో వైరల్ అయిపోతూ ఉంటుంది. మాస్‌లో ఆయనకున్న క్రేజ్ అలాంటిది. ప్రస్తుతం ఆయన కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఊర్వశీరౌతేలా కథానాయిక. కొత్త విషయం ఏంటంటే.. ఇందులో ఆమెతో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు ఉన్నారట. వారే ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్. ఇది నిజమైతే అభిమానులకు నిజంగా పండుగే. ఈ సినిమాలో బాలయ్య రెండు కోణాలున్న పాత్రలో కనిపిస్తారని యూనిట్ వర్గాల సమాచారం. బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మాస్ యాక్షన్ అంశాలకు కొదువుండదట. పైగా ఈ సినిమాలో పొలిటికల్ నేపథ్యం కూడా ఉంటుందని టాక్. 'రీసెంట్‌గా రషెస్ చూశాను.. ఫ్యాన్స్‌కి పండగే' అంటూ సంగీత దర్శకుడు తమన్ ఇచ్చిన లీక్ కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. దీంతో వరుసగా నాలుగో బ్లాక్‌బాస్టర్ పక్కా అని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. ఇదిలావుంటే.. మలయాళంలో ఈ ఏడాది భారీ విజయాన్ని అందుకున్న ఫహద్ ఫాజిల్ 'ఆవేశం' సినిమాను, తెలుగులో బాలయ్యతో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు ఈ చిత్రం రీమేక్ హక్కులు సొంతం చేసుకోవడంతోపాటు, బాలకృష్ణను ఒప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారట. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.





## డ్రాగన్‌కు ముహూర్తం ఖరారు?

ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర హీరో ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తర్వాత ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఇంటెన్స్ యాక్షన్ డ్రామాకు సిద్ధమవుతున్నారు ఎన్టీఆర్. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన మే నెలలో వెలువడింది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని వార్తలొచ్చాయి. ఆగస్ట్‌లో ఈ చిత్రాన్ని ప్రారంభిస్తామని మేకర్స్ ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం ఈ వారంలోనే ఈ సినిమాను లాంచ్ చేయబోతున్నట్లు తెలిసింది. ఈ విషయంలో త్వరలో ఓ ప్రకటన వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'దేవర' చిత్రంతో పాటు హిందీలో 'వార్ 2'లో నటిస్తున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌పై దేశవ్యాప్తంగా ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com